306 మందికి వైద్యసేవలు



నరసరావుపేట: ఇంటింటికీ ఆరోగ్య భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రకాష్ నగర్ పదో వార్డు సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 306 మంది ప్రజలకు వైద్యసేవలు అందజేశారు. వైద్య శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు, డీఎండీహెచ్‌వో డాక్టర్ బి.రవి పరిశీలించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డాక్టర్ ఆశాలత రోగులకు వైద్యసేవలు అందజేయగా ఏఎస్ఎం కత్తెర విజయలక్ష్మి, వైద్య సిబ్బంది సేవలు అందజేశారు.

మాజీలిద్దరూ దోచుకున్నవారే!

- మాజీ ఎమ్మెల్యే జి.వి. మక్కెనలపై ఎమ్మెల్యే బొల్లా విమర్శ
- మునుగు తీసిన తోడు దొంగలను నమ్మవద్దంటూ పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): మాజీ ఎమ్మెల్యేలు జి.వి ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావులు వినుకొండ నియోజకవర్గాన్ని ఇద్దరు కలసి ఒప్పందం ప్రకారం దోచుకున్నారని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మ నాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉండగా మాజీ ఎమ్మెల్యే మక్కెన నియోజకవర్గంలోని చేపల చెరువులను అక్రమ మార్గాల్లో దోచుకున్నారని, కాంగ్రెస్ పార్టీ మక్కెన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జీవీ ఆంజనేయులు నకిలీ ఎరువులు, పేరుతో భారీగా అక్రమార్జన చేశారన్నారు.

మరలా ఇద్దరు ఇప్పుడు కలసి వినుకొండ ప్రజలను మోసం చేసేందకు మరోమారు కలశారన్నారు. వీరి మోసంలో ప్రజలు పడవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రానున్న రోజుల్లో ప్రజలను మోసం చేసేందకు ఇద్దరు మాజీలు తయారైయ్యారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పేదల పార్టీ అని వారిది మాత్రం దొరల పార్టీ అని అన్నారు. ఎవరి పాలన కావాలో ప్రజలే తేలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ జయశ్రీవెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మీ రాజా, జెడ్పీ కోఆప్షన్ గుండాల స్వెనోమ్ పాల్గొన్నారు.

వడ్డీ మాఫీతో రూ.18 లక్షలు ప్రయోజనం

- కేవలం రూ.6.59 లక్షలు చెల్లించి ఆస్తిపన్ను బకాయిలు నుంచి బయటపడిన వ్యక్తి
- వడ్డీ మాఫీని ఉపయోగించుకోవాలన్న మున్సిపల్ కమిషనర్



కమిషనర్‌కు నగదు అందజేస్తున్న ఆస్తి యజమానులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ అవకాశాన్ని ఉపయోగించుకున్న ఓ వ్యక్తి రూ.18 లక్షల ప్రయోజనం పొందారు. పట్టణంలోని కొటారు లక్ష్మయ్యనాయుడు తమ ఆస్తిపన్నుకు సంబంధించి 1993-94 ఏడాది నుంచి బకాయి ఉంది. ప్రభుత్వం మార్చి నుంచి ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులు బకాయిలపై వడ్డీ లేకుండా చెల్లించే అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న లక్ష్మయ్య నాయుడు రూ.18 లక్షలు వడ్డీ మాఫీ పొంది పురపాలక సంఘానికి రూ.6.59 లక్షలను గురువారం మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి ద్వారా రెవెన్యూ ఆఫీసర్ షేక్ అబ్దుల్ జబ్బర్ అందించారు. చెల్లించిన పన్నుకు సంబంధించిన రసీదును వెంటనే అందజేశారు. కొంతకాలంగా ఆస్తిపన్ను, ఖాళీస్థలం పన్నులు చెల్లించని వారిచే వడ్డీ లేకుండా చెల్లించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. మున్సిపల్ ఇంజినీర్ కనకారావు, రెవిన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో పురోగమిస్తున్నారు

చిలకలూరిపేటటౌన్: మహిళలు అన్ని రంగాల్లో పురోగమిస్తున్నారని నాదెండ్ల ఐసీడీఎస్‌ప్రాజెక్ట్ సీడీపీవో శాంతకుమారి తెలిపారు. గురువారం ప్రముఖ స్వచ్ఛంధ సంస్థ అసిస్ట్, ఐటీసీ సంయుక్త ఆధ్వర్యంలో అసిస్ట్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ మారుతున్న సమాజంతో పాటు మహిళలు మరింతగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీవో నిర్మలకుమారి, యడ్లపాడు ఎంఈవో నాగరత్నం, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ఇందిరా, అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు జె కృష్ణ హరీఫ్, ఎంఎస్ఆర్‌సీ మూర్తి, విష్ణుప్రియ పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి



నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యార్థి దశ నుంచే పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని అందించే ఇతర పుస్తకాల పఠనాన్ని అలవరుకోవాలని జిల్లా బాలికా శిశు సంక్షేమ అధికారిణి రేవతి తెలిపారు. గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతిని పురస్కరించుకుని శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో పెదచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో గురువారం నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గ్రంథాలయాన్ని ప్రారంభించిన జీసీడీవో రేవతి మాట్లాడుతూ, పుస్తక పఠనం మంచి లక్షణమని తెలిపారు. ఈసందర్భంగా అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో గ్రంథాలయాల అభివృద్ధిపై ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్, పాఠశాల ప్రిన్సిపల్ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు



నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో రైతు తీవ్రగాయాలపాలైన సంఘటన చిలకలూరిపేట-నరసరావుపేట రహదారిపై లింగంగుంట్ల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన బొప్పూడి అప్పారావు తన భార్యతో కలిసి మహాశివరాత్రి సందర్భంగా అప్పాపురం గ్రామంలో జరిగే గ్రామప్రభ తిరునాళ్లకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అయితే కావూరు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో దంపతులు ఇరువురూ రోడ్డుపై పడగా, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో అప్పారావుకు ఒక కన్ను పూర్తిగా దెబ్బతింది. స్థానికులు హుటాహుటిన గుంటూరులోని జీజీహెచ్‌కు తరలించారు. స్పెషలిస్ట్ వైద్యులు క్షతగాత్రుడి తల, కంటికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. ప్రమాదంపై పోలీసులకు బంధువులు సమాచారమిచ్చారు.

సంక్షిప్త వార్తలు

■ మన్నేపల్లి తండాలో నేడు కల్యాణం

బొల్లాపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన శ్రీ మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల నేడు నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లా సరిహద్దు ప్రాంతమైన బొల్లాపల్లి మండలం మన్నేపల్లి తండా సమీపంలో అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ మన్నేపల్లి లక్ష్మీనరసింహా స్వామికి కల్యాణం నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినాన శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగుతుంటే ఈ దేవాలయంలో మన్నేపల్లి లక్ష్మీనరసింహ స్వామికి కల్యాణం జరపడం ప్రత్యేకత. స్వామివారి కల్యాణం కనుల విందుగా, అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి లక్షలాది మంది తరలివస్తారు.

■ చిరుమామిళ్ళలో మహాశివరాత్రి ఉత్సవాలు

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామంలో కొలువైయున్న త్రికోటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం జరగనున్న పండుగను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకాలు, అర్చనలు జరపటంతో పాటూ గ్రామ ప్రభలు ఏర్పాటు చేసినట్లు ఆలయ పూజారి భరత్‌కుమార్ తెలిపారు.

■ అధ్యాపకుడికి ఘననివాళి

నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణ, అంకితభావానికి మారుపేరుగా చరిత్ర అధ్యాపకునిగా దుర్గాప్రసాద్ అందించిన సేవలు నిరుపమానమని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. కళాశాల చరిత్ర విభాగాధిపతిగా సేవలు అందించిన జి.దుర్గాప్రసాద్ సంస్మరణ కార్యక్రమాన్ని గురువారం చరిత్ర విభాగం వద్ద నిర్వహించారు. దుర్గాప్రసాదు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహనరావు, చరిత్ర విభాగాధిపతి పి.రాంబాబు, గ్రంథాలయాధికారి పి.రామాంజనేయరెడ్డి, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ క్రీడా సామగ్రి వితరణ

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో కెనరా బ్యాంక్ వెల్లటూరు శాఖ క్రీడాసామగ్రి వితరణగా అందజేశారు. ఆ బ్యాంక్ కెనరా విద్యాజ్యోతి పథకంలో విద్యార్థులకు ఉపయోగపడే సుమారు రూ.40 వేలు విలువ చేసే ఆట వస్తువులను బ్యాంక్ మేనేజర్ జోసఫ్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషాకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ అధికారులకు సహకరించాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని పొట్లూరు, వేల్పూరు,శావల్యాపురం గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల సారథ్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఆయనతో పాటు కేంద్ర బలగాల సర్కిల్ ఇన్‌స్పెక్టరు మీనా, ఎస్సై చల్లా సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

■ భూహక్కు పట్టాలు పంపిణీ

శావల్యాపురం: నవ రత్నాలల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్హత కల్గిన ఉన్న లబ్ధిదారులందరికీ ఇంటి నివేశిత హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 1256 మంది లబ్ధిదారులకు ఇంటి నివేశిత స్థలాలకు సంబంధించిన భూహక్కు పత్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

■ మహిళా సాధికారత...

నరసరావుపేట ఈస్ట్: మహిళా సాధికారతపైనే దేశ ప్రగతి ఆధారపడి ఉంటుందని జిల్లా పౌరసరఫరాల అధికారిణి ఎస్.పద్మశ్రీ తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మహిళా ఉద్యోగినులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమారి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి.నీలీపీటర్ తదితరులు పాల్గొన్నారు.